


పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బొల్లాపల్లి: వినుకొండ నుంచి 20 మందితో మర్రివేముల వెళుతున్న ఆర్టీసీ బస్సు వెల్లటూరు వద్ద ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఎవరూ గాయపడలేదు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 563.10 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శాకంబరిగా భవానీ అమ్మవారు



సత్తెనపల్లి: ఆషాఢ మాసం పురస్కరించుకొని స్థానిక అమ్మిశెట్టివారివీధిలో ఉన్న త్రికోటేశ్వర స్వామి గుడిలో భవానీ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

అందుబాటులోకి పురమిత్ర యాప్

కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల అర్బన్: బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈమేరకు పురమిత్ర యాప్‌ను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇంట్లో ఉండే అన్ని సేవలను పొందే విధంగా రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చిందని, 'పుర మిత్ర' యాప్ ఇక నుంచి ప్రజలకు పౌర సేవలను అందించనుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో రూపొందించిన ఈ యాప్‌లో పలు సేవలు పొందే వీలు ఉంటుందని తెలిపారు.

అద్దంకిలో 62.6 మి.మీ వర్షపాతం

అద్దంకి రూరల్: అద్దంకి శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 62.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లలో నీరు చేరింది.

ముగిసిన పవిత్రోత్సవాలు



పెదకాకాని: శివాలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకల చివరిరోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగా, 20వ తేదీన శ్రీ భ్రమరాంబ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేయనున్నారు. స్థానాచార్యులు పాత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పాత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, దాతలు నేలవెల్లి కోటేశ్వరి, కర్నే శివ సందీప్ నాగశిరీష, రెడ్డి నవీన్ కుమార్ విజయలక్ష్మి, నేలివెల్లి నాగప్రత్యూష, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ స్థలాన్ని పరిశీలించిన పల్నాడు కలెక్టర్



విజయపురి సౌత్: మేకల గొంది నుంచి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్లతో మాచర్ల నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత స్థలాన్ని అధికారులు పరిశీలించారు. మేకల గొందిలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసే స్థలంలో సర్వే మ్యాపులను పరిశీలించారు.అన్ని అనుమతులు మంజూరయితే నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ, డీఎఫ్ఓ సందీప్ కుమార్, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

నాటి ముందు చూపు..

నేడు మారనున్న రూపు

ఏ ప్రభుత్వానికైనా ముందు చూపు అవసరం. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఫలాలు ప్రజలకు అందుతాయి. అందులో భాగంగానే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021లో బెంగళూరు-విజయవాడను కలిపే కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అదే సంవత్సరం ఆగస్ట్ నెలలో ప్రణాళికను ఆమోదించింది. పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2026 నాటికి హైవేపై వాహనాలు పరుగులు తీయనున్నాయి. బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు సమయంతోపాటు డబ్బు ఆదా కానున్నాయి. అంతేకాదు అద్దంకి పరిసర ప్రాంతాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి.

- 2021లో ప్రతిపాదనలు పంపిన నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- 2023 నుంచే భూ సేకరణ పనులకు శ్రీకారం
- 14 ప్యాకేజీలుగా రహదారి నిర్మాణం
- అద్దంకి, ముప్పవరం దగ్గర హైవేలోకి వాహన ప్రవేశాలు
- 2026కి అందుబాటులోకి రానున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

చురుగ్గా బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు



నిర్మాణంలో వంతెన

అద్దంకి: అభివృద్ధిలో వైఎస్సార్ సీపీ ఏనాడూ వెనుకంజ వేయలేదనే సత్యం నేడు వెలుగులోకి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021లో బెంగళూరు-విజయవాడను కలిపే కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అదే సంవత్సరం ఆగస్ట్ నెలలో ప్రణాళికను ఆమోదించింది. దీంతో బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ గ్రీన్ ఫీల్డ్ హైవేకి శ్రీకారం చుట్టారు. 2024 మార్చిలో పనులు ప్రారంభమయ్యాయి. 2026-27 నాటికి ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి అందుబాటులోకి రానుంది. ఈ రహదారి కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నుంచి బాపట్ల జిల్లాలోని ముప్పవరం వద్ద జాతీయ రహదారికి అనుసంధానం కానుంది. దీంతో అద్దంకి పరిసర గ్రామాలు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని వారికి బెంగళూరు-విజయవాడ ప్రయాణ సమయం తక్కువ కానుంది. ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాలను కలుపుతూ వెళ్తున్న కన్యాకుమారి-కోల్‌కత్తా జాతీయ రహదారి, అద్దంకి పట్టణం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలిపే అద్దంకి-నార్కెట్‌పల్లి, వైఎస్సార్ హయాంలో నిర్మించిన రాష్ట్రీయ రహదారులున్నాయి. ప్రస్తుత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో తూర్పు-దక్షిణ భారతదేశం మధ్య ప్రత్యక్ష సంబంధం ఏర్పడనుంది. బెంగళూరు నుంచి సత్యసాయి జిల్లాలోని కొడికొండ వద్ద మొదలై బాపట్ల జిల్లాలోని అద్దంకి వద్ద జాతీయ రహదారిలో కలుస్తుంది. బెంగళూరు నుంచి బాపట్ల జిల్లాలోని ముప్పవరం వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు 14 ప్యాకేజీలుగా విభజించారు. అందులో మిగిలిన ప్యాకేజీలు ఇప్పటికే జరుగుతుండగా, ప్రకాశం జిల్లాలోని సోమవరప్పాడు నుంచి, అద్దంకి మండలం కొటికలపూడి, వేలమూరిపాడు, దక్షిణ అద్దంకి, ఉత్తర అద్దంకి, కలవకూరు, ముప్పవరం, జాగర్లమూడివారిపాలెం కొటికలపూడి గ్రామాల్లో 14 నంబరు ప్యాకేజీగా పనులు మొదలై చురుగ్గా సాగుతున్నాయి. దానిలో భాగంగా ఇక్కడ తొలుత కల్వర్టులు, పైప్‌లైన్లు, యుటిలిటీ పనులు చేస్తున్నారు.



అద్దంకిలో నిర్మాణంలో ఉన్న రహదారి

గుండ్లకమ్మపై మరో వంతెన..

అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో ఇప్పటికే గుండ్లకమ్మ నదిపై ఒక వంతెన 1981 నుంచి అందుబాటులో ఉండగా, సమీప గ్రామమైన కొటికలపూడి-వేలమూరిపాడు గ్రామాల మధ్య మరో వంతెన అందుబాటులోకి రానుంది. రూ.703 కోట్లతో ఈ వంతెన నిర్మాణానికి డ్రిల్లింగ్ చేసి పనులను ప్రారంభించారు.

రహదారి వివరాలు.

ఈ రహదారి ఆరు లైన్లతో.. 14వ నంబరు ప్యాకేజీలో 28.64 కిలోమీటర్లు పొడవున నిర్మాణం కానుంది. ఈ రహదారి 70 మీటర్ల వెడల్పుతో నిర్మించనుండగా, రెండు వైపులా ప్లాంటేషన్, కొన్ని ప్రాంతాల్లో మినహా మధ్యలో డివైడర్, అద్దంకి, ముప్పవరం ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో మినహా మరెక్కడా వాహనాలకు ప్రవేశ ద్వారాలు ఉండవు. పట్టణంలోని ఒంగోలు రహదారిని క్రాస్ అయ్యే ప్రాంతంలో రెండు ఔటర్ రింగ్‌లు చిన్నచిన్న వాహనాలు పోవడానికి అవకాశం కల్పించనున్నారు. మిగిలిన చోట్ల రహదారి నుంచి క్రాస్ అయ్యే సమయంలో అండర్ పాస్‌లు నిర్మించనున్నారు. ఈ రహదారిలో 120 నుంచి 150 కిలోమీటర్ల వేగం ఉంటుందని అంచనా. దాంతో అద్దంకి పరిసర ప్రాంతాల్లో వ్యాపార, రవాణా, అత్యధిక దూరంలోని బెంగళూరు, విజయవాడ ప్రాంతాల మధ్య ప్రయాణం సమయం12 నుంచి 13 గంటలు తగ్గి 8 గంటల నుంచి 9 గంటల్లోకి రానుంది.

వేరుశనగ సాగుకు కేరాఫ్ బాపట్ల



కర్లపాలెంలో సాగుచేస్తున్న వేరుశనగ పొలాలు



పొలాల సమీపంలో వేరుశనగ కాయలు విక్రయిస్తున్న మహిళలు

- ఏడాదిలో రెండు, మూడుసార్లు సాగు
- ఇతర జిల్లాలకు ఎగుమతి
- వైఎస్సార్ ఉచిత విద్యుత్ పథకంతో సాగులోకి వచ్చిన బీడు భూములు
- రాజన్నను మరువలేమంటున్న రైతులు

బాపట్ల : ఇరవై ఏళ్ల కిందట వరకు బాపట్ల మండలం స్టువార్టుపురం నుంచి కర్లపాలెం వెళ్లేంతవరకు రహదారికి ఇరువైపులా ఖాళీ పొలాలు దర్శనమిచ్చేవి. అక్కడక్కడ ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసేవారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకంతో బీడు భూములు కాస్త సాగులోకి వచ్చాయి. ప్రస్తుతం పొలాలన్నీ పచ్చదనం సంతరించుకున్నాయి. ఏడాది పొడవునా వేరుశెనగ పంట సాగు చేస్తున్నారు.

ఉచిత పథకంతో మహర్దశ

గతంలో నీటి సౌకర్యం లేక బీడు భూములను తలపించేలా ఉండే పంట పొలాలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలి సంతకం ఉచిత విద్యుత్ పథకం ఫైలుపై చేశారు. పథకం ఈ ప్రాంత రైతులకు వరంగా మారింది. ఈ పథకం కింద చిన్నగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో సుదూర ప్రాంతం నుంచి విద్యుత్ లైన్లు సౌకర్యం ఏర్పాటుచేసుకొని పొలాల్లో బోర్లు దింపి వాటి సహాయంతో వేరుశనగ సాగుచేస్తున్నారు. మొదట్లో 2 వేల ఎకరాలలో వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం 15వేలకు పైగా ఎకరాలలో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ఏ ఒక్క రైతును పలకరించిన మహానేత అమలుచేసిన ఉచిత విద్యుత్ పథకమే మా బతుకుల్లో వెలుగులు నింపిందంటూ ముక్త కంఠంతో చెబుతున్నారు.

వేలాది కుటుంబాలకు నిత్యం ఉపాధి

ఒకప్పుడు ఈ ప్రాంతంలోని కూలీలకు ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే వ్యవసాయ పనులుండేవి. సీజన్ ముగిసిన తర్వాత ఏడాది అంతా ఖాళీగా ఉండేవారు. ప్రస్తుతం వేరుశనగ ఏడాది పొడవునా సాగు చేస్తుండడంతో ఆయా గ్రామాల్లోని వేలాది మంది కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి లభించింది. వేరుశెనగ పొలంలో తక్కు రొల్లడం, కలుపు తీయటం, కాయలు కోయటం, కల్లాలను శుభ్రం చేయటం, కాయలు నుంచి పప్పును వేరు చేయటం లాంటి పనులు నిత్యం ఉంటున్నాయి. దీంతో ఉపాధి కోసం వలసలు వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే ఉపాధి దొరుకుతుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర జిల్లాలకు ఎగుమతి

రాష్ట్రంలోనే వేరుశనగ సాగుకు అనంతపురం జిల్లా పేరుగాంచింది. ప్రస్తుతం బాపట్ల జిల్లా కూడా అనంతపురం జిల్లా సరసన చేరింది. వేరుశెనగ ప్రస్తుతం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో బస్తా రూ.2,500 ఉండగా దళారులు రైతుల వద్ద రూ.2వేలకే కొనుగోలు చేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి రూ.2500కు అమ్ముకుని లాభాలు ఆర్జిస్తున్నారు. వేరుశెనగ కాయలతోపాటు ఉడికించిన కాయలు, వేరుశనగ పచ్చి పప్పు, వేయించిన పప్పు, వాటి నుంచి నూనె, వేరుశెనగతో తయారుచేసి తినుబండరాలను కూడా ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

మహానేత పుణ్యమే...



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచితంగా విద్యుత్ ఇవ్వటం వల్లనే బోర్ల ద్వారా వేరుశనగ సాగు చేయటం ప్రారంభించాం. వేరుశనగ పంట పైనే ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. రిటైల్ మార్కెట్‌తోపాటు ఒక్కసారిగా మార్కెట్‌కు కూడా ఎగుమతి చేసేందుకు అవకాశం ఉంది.

–వేంకటేశ్వరరెడ్డి, కావూరివారిపాలెం

వేరుశనగ ఎంతో లాభంగా ఉంది



ఏడాదిలో రెండు, మూడు పంటల సాగు ఎంతో లాభాదాయకంగా ఉంది. ఖాళీగా ఉండకుండా రైతులకు వేరుశెనగ పైరు లాభాలు తెచ్చిపెడుతుంది. మార్కెట్‌లో కూడా ధర బాగానే ఉండటం వలన రైతులకు గడిచిన మూడేళ్లుగా ఎంతో మేలు రకంగా వేరుశనగ కనిపిస్తుంది.

–శ్రీనివాసరావు, వెదుళ్లపలి

బాబోయ్.. వెజి'ట్రబుల్స్'



పచ్చిమిర్చి



దుకాణంలో కూరగాయలు

- కొండెక్కిన కూరగాయల ధరలు
- మంట పుట్టిస్తున్న పచ్చిమిర్చి

అద్దంకి: వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రెండు రోజుల్లోనే ధరలు రెట్టింపు కావడంతో సామాన్యులు, పేదలు బెంబేలెత్తిపోతున్నారు. వందలు ఖర్చు చేసినా ఓ చిన్న కుటుంబానికి నాలుగైదు రోజులకు సరిపడా కూరగాయాలు రావడం లేదు. పచ్చి మిర్చి ధర కిలో రూ.120కి చేరుకుంది. మిగిలిన కూరలు కిలో రూ.50పైగానే పలుకుతున్నాయి. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో పేదలు కనీసం పచ్చడి మెతుకులు వండుకోవడానికీ ఆలోచించాల్సి వస్తోంది. ప్రతి వంటకు అవసరమైన పచ్చిమిర్చితో పాటు మునగ కాయలు కూడా కొండెక్కాయి. కిలో పచ్చిమిర్చి నాలుగు రోజుల కిందట రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.120 చేరుకుంది. మునగ రూ.120 పలుకుతోంది. రూ.20 ఉండే బీర, దోస ధరలు రూ.60కి పైమాటే. ఇక క్యారెట్, బీట్రూట్ రూ.70 పలుతున్నాయి. చిక్కుడు ధర రూ.90కి పైమాటే. టమోటా కిలో ధర రూ.40 వరకు పలుకుతోంది. ఆకుకూరల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్యుడు విలవిల్లాడిపోతున్నాడు. వర్షాలు లేకపోవడంతో కూరగాయలు పండలేదని, సుదూరప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి రావడంతోనే ధరలు బాగా పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడినా, ఈ ప్రాంతంలోని భూముల్లో కూరగాయలు పండి మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చేసరికి కనీసం నలభై నుంచి యాభై రోజులు పడుతుందని, అప్పటివరకూ ఈ ధరలు భరించక తప్పదేమోనని ప్రజలు భయపడుతున్నారు.

కూరగాయ రకం	ధర (రూ)
పచ్చి మిర్చి	120
మునగకాయలు	120
చిక్కుళ్లు	90
క్యారెట్	80
బీట్రూట్	70
బంగాళాదుంప	50
దోస	40
బెండ	60
బీర	60

కూరగాయలు కొనలేం

నాలుగు రోజుల్లోనే కూరగాయల ధరలు పెరిగిపోయాయి. పచ్చి మిర్చి ధర ఆకాశాన్ని అంటింది. మిగిలిన కూరల ధరలు అదే విధంగా ఉన్నాయి. ప్రభుత్వం పేదలను ఆదుకోవాలి.

శ్రీలక్ష్మి, గృహిణి

అదునులో వర్షాలు లేకనే

అదునులో వర్షాలు కురవకపోవడం వల్ల ఈ ప్రాంతంలో కూరగాయలు వేయక గిరాకీ పెరిగింది. కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దాంతో ధరలు మరీ పెరుగుతున్నాయి.

–వెంకటేశ్వర్లు, రైతు


మానవ హక్కుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా లక్ష్మి



నాదెండ్ల: ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ మహిళా విభాగం వైస్ చైర్మన్‌గా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన మందపల్లి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు ఆర్ బాలరాజు నుంచి ఉత్తర్వులు అందాయి.

22 ఏలో ఉన్న 102 ఎకరాల భూమికి విముక్తి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల అర్బన్: దశాబ్దాలుగా 22-ఏలో ఉన్న 102 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామంలోని రైతులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ఆ భూమిని పోరంబోకు భూమిగా దస్త్రాలలో నమోదు చేశారన్నారు. తప్పుగా నమోదు చేయ డం ద్వారా ఆరు దశాబ్దాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నామని 20 రోజుల కిందట కలెక్టర్‌కు విన్నవించారు. మా భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించారు. తదుపరి రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ దస్త్రాలలో తప్పుగా నమోదు చేయడం ద్వారానే ఆ గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. అప్పట్లో ఉన్న రెవెన్యూ అధికారులు వాటిని సరిచేయక పోవడంతోనే 1987 లో పోరంబో కు భూములుగా దస్త్రాలలో నమోదయ్యాయన్నారు. తదుపరి 22 ఏ నిషేధిత భూముల జాబితాలోకి వెళ్లిపోయిందని తెలిపారు. దశాబ్దాల కిందట దస్త్రాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, విచారించిన తదుపరి ఆ భూములు 87 మంది రైతులవేనని తేలిందన్నారు. ప్రభుత్వంతో చర్చించిన అనంతరం ఆ భూమికి సాగు పట్టా భూమిగా గుర్తించామన్నారు. సాగులో ఉన్న ఆ భూమి యజమానులకు పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. పాస్ పుస్తకాలు ఇస్తామన్నా రు. సమావేశంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, నిజాంపట్నం తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు, ముత్తుపల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు... పనితీరు వేగవంతం చేయాలి

బాపట్ల: రెవెన్యూ శాఖ నిర్వహించే వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పనితీరును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు సంబంధించి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పీ-4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను, మార్గదర్శులను నిర్ధారించడంలో వారి స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకులకు సంబంధించి గ్రామసభలు ఏర్పాటుచేసి చేర్పులు, తొలగింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీ లోపు మార్పులు, చేర్పులు పూర్తిచేయాలన్నా రు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కనకరాజు, సీపీఓ షాలేమ్ రాజు, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎల్‌డీవోలు పాల్గొన్నారు.

పొగాకు నిల్వ చేసేందుకు గోడౌన్ల అన్వేషణ

కొనుగోలు చేసిన పొగాకును నిలువ చేసేందుకు కొత్త గోడౌన్లను అన్వేషించే బాధ్యతను జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులకు, జిల్లా మేనేజర్‌కు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన 2529.650 మెట్రిక్ టన్నులను బ్లాక్ బర్లీ పొగాకును జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశం ఆమోదించింది. కొనుగోలు చేసిన పొగాకును గోడౌన్లలో కొంతవరకు పెట్టడం జరిగిందన్నారు. మిగిలిన పొగాకును వేరొక పెద్ద గోడౌన్లకు తరలించి ప్రస్తుతం ఉన్న కేంద్రాల్లో పొగాకు కొనుగోలు చేయాలని తీర్మానించినట్లు కలెక్టర్ తెలిపారు. బ్లాక్ బర్లీ పొగాకును తరలించడానికి టెండర్ల ఆహ్వానం బాధ్యతను జిల్లా మేనేజర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు


గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	40,141
అమ్మకాలు	44,297
నిల్వ	3,365

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,600
సూపర్ -10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,700
4884	10,000-12,400

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,400
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

మేడికొండూరులో 36.4 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 136.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పెదకాకాని మండలంలో 7.2 మి.మీ. పడింది. సగటు 45.4 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. గుంటూరు తూర్పులో 96.4 మి.మీ., గుంటూరు పశ్చిమ 94.6, కొల్లిపర 60.2, తెనాలి 58.2, వట్టిచెరుకూరు 56.2, చేబ్రోలు 44, దుగ్గిరాల 43.6, ప్రత్తిపాడు 40.4, పెదనందిపాడు 34.2, ఫిరంగిపురం 29.8, మంగళగిరి 29.4, కాకుమాను 26.4, పొన్నూరు 19.4, తుళ్ళూరు 18.4, తాడికొండ 14.6, తాడేపల్లి మండలంలో 7.8 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది. జూలై 18వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 95.8 మి.మీ. వర్షపాతం పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 59.3 మి.మీ. నమోదైంది.

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని పొర్లు దండాలు పెడుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

రేపల్లె: సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరం శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం పొర్లు దండాలు పెట్టారు. కూటమి ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వంగా, ప్రజల సమస్యలు పట్టని ప్రభుత్వంగా అభివర్ణించారు. మణిలాల్ మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించమంటే ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వ్యతిరేకతను మూటకట్టుకుంటోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత కార్మికులుగా చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. చట్టపరమైన సెలవులను అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.రవిబాబు, కె.రాఘవేంద్రరావు, రవి, శ్రీను, సుబ్బారావు, సుధాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో ఆరోగ్యకర దిగుబడులు

డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివకుమారి



గుడిపూడిలో రైతులకు మినుములు, కందులు పంపిణీ చేస్తున్న డీడీఏ శివకుమారి

సత్తెనపల్లి: సాగులో ఫాస్ఫరస్ సాలుబు లైజింగ్ బాక్టీరియా, అజోల్లా, వామ్ తదితర జీవన ఎరువులు వాడుకుని ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించాలని పల్నాడు జిల్లా రైతు శిక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(డీడీఏ) ఎం.శివకుమారి సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని ఆమె చెప్పారు. మండలంలోని గుడిపూడిలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ ఆఖరి దుక్కిలో ఫాస్ఫరస్ వేసుకోవాలని, దీనివల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. నారుమడిలో చల్లుకునే ముందు శిలీంద్ర నాశిని అయిన కార్బెండిజం మూడు గ్రాములను కేజీ వరి విత్తనాలకు కలిపి, విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా విత్తన దశ నుంచే తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారిణి ఎం.అరుణ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు నవ ధాన్యాలను సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలని చెప్పారు. దీని వల్ల సూక్ష్మ జీవులు బాగా అభివృద్ధి చెంది, భూమి సారవంతం అవుతుందని వివరించారు. సత్తెనపల్లి మండల వ్యవసాయధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పత్తి, మిరప, వరి సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను వేసి, పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలని సూచించారు. మిరప రైతులు షేడ్ నెట్‌లలో నారు పెంచుకోవాలని ఆమె చెప్పారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం కింద 100 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన మినుములు, కంది విత్తనాల చిరు సంచులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మైక్రో ఆర్టిస్ట్ మహితకు కలెక్టర్ మురళి ఆర్థిక ప్రోత్సాహం



బాపట్ల : చీరాలకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ అన్నం మహిత జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. తన అద్భుతమైన కళా ప్రతిభతో మహిత 93 పెన్సిల్స్‌పై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, మరో 810 పెన్సిల్స్‌పై మహాభారతంలోని 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి అందరి ప్రశంసలు అందుకున్నారు. మహిత అసాధారణ ప్రతిభను కలెక్టర్ మురళి అభినందించారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, తన వంతు సహాయంగా రూ.15వేలు చెక్కు రూపంలో మహితకు అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య యాదవ్ పాల్గొన్నారు. కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా కలెక్టర్ తీసుకున్న ఈ చొరవను పలువురు అభినందిస్తున్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి



రేపల్లె: చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరంలో దూర విద్య ద్వారా పదో తరగతి చదువు మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా స్టడీ సెంటర్ల నిర్వాహకులు పనిచేయాలని కోరుతూ పట్టణంలోని ఓ స్టడీ సెంటరులో శుక్రవారం వాల్‌పోస్టర్‌లను విడుదల చేసి మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ ఓపెన్ పదో తరగతి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్, ఎంఈవో రత్నశ్రీధర్, వివిధ స్టడీ సెంటర్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం తురిమెళ్ల తూర్పు కాలువలో శవం కనిపించడంతో గ్రామస్తులు శుక్రవారం గ్రామ వీఆర్వోకు దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్వో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవితేజ తెలిపారు.

భూసార పరీక్ష ఫలితాలే కీలకం

- వాటి ఆధారంగా పంటకు నత్రజని ఎరువులు వాడాలి
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రైతులు పంటల్లో నత్రజని ఎరువులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలకు కావాల్సిన ముఖ్య పోషకాల్లో నత్రజని కీలకమన్నారు. ఇది అమ్మోనియం, నైట్రేట్ రూపాల్లో దొరుకుతుందని పేర్కొన్నారు. పైరు పెరుగుదల సమయంలో దుబ్బులు చేయడంలోనూ, కొమ్మలు తొలగడంలోనూ ఈ ఎరువు ప్రభావం ఉంటుందని తెలిపారు. ఆకులు కూడా ముదురాకు పచ్చని రంగుతో ఆరోగ్యంగా కనిపిస్తాయని వెల్లడించారు. నత్రజని తగినంత ఉన్నప్పుడు మిగిలిన పోషకాలు కూడా సమర్థంగా అందుతాయని చెప్పారు. నత్రజని ఎరువులను అవసరమైన మేరకే మూడు దఫాలుగా వాడాలని, అధికంగా వేస్తే పైరు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూత ఆలస్యంగా వచ్చి పంట కాలం పెరగడం, తాలు గింజల శాతం అధికం కావడం, చీడపీడలకు సులభంగా గురికావడం, దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని వివరించారు. నత్రజని లోపించినప్పుడు మొక్కల పెరుగుదల నెమ్మదిగాను, పొట్టిగాను ఉండిపోవడం, ఆకులు పాలిపోయి పసుపు పచ్చగా మారడం, ఫలసాయంలో మాంసకృతుల శాతం తగ్గిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు.
లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకుల కొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం, ముదురు ఆకులు ముందుగానే పసుపుగా మారి ఎండిపోయి రాలిపోవడం, పూత బాగా తగ్గి తక్కువ దిగుబడి రావడం జరుగుతుందన్నారు. నత్రజని ఎరువులను పంటలకు అందించడానికి యూరియా లేదా అమ్మోనియం సల్ఫేట్ లేదా కాల్షియం అమ్మోనియం నైట్రేట్ లేదా అమ్మోనియం క్లోరైడ్ తదితర ఎరువులను వేసుకోవాలని సూచించారు. సమతుల ఎరువుల వాడకం భూసార పరీక్షల వల్ల మాత్రమే సాధ్యపడుతుందని చెప్పారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా నత్రజని ఎరువులను ఉపయోగించాలని ఆయన తెలిపారు.

అక్రమ కేసులో విచారణకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హాజరు

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నెల 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన నేపథ్యంలో జన సమీకరణ చేశారంటూ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిపై సత్తెనపల్లిలో మరో అక్రమ కేసు నమోదైంది. ఈ నెల 11న మొదటి కేసు విషయమై సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఆ సమయంలో రెండో కేసు ఊసును పోలీసులు ఎత్తలేదు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు రెండో కేసు నమోదు చేసి ఈ నెల 16న విచారణకు హాజరు కావాలంటూ హడావుడిగా నోటీసులను గుంటూరుకొచ్చి అందించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ విచారణ నిమిత్తం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషనుకు హాజరై, సీఐ ఎం వీ సుబ్బారావు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆయన వెంట పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, పల్నాడు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, నాయకులు మందపాటి శేషగిరిరావు, చల్లంచర్ల సాంబశివరావు, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి కృపారావు తదితరులు ఉన్నారు.

పాత పింఛను విధానం అమలుకు డిమాండ్



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు వెస్ట్: పాత పెన్షన్ విధానాన్ని 2003 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని అమలు చేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోపిదేవి శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. తమకు నోటిఫికేషన్ వచ్చే నాటికి ఓపీఎస్ విధానం అమలు కాలేదన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన టెక్నికల్ తప్పుల వలన తాము తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 57 ఇదే అంశాన్ని ధ్రువీకరిస్తోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సకాలంలో స్పందించకపోతే తమ న్యాయ పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సలగల ప్రసన్న కుమార్, ఘంటసాల శ్రీనివాసరావు, నరసింహారావు, శ్రీలం యలమంద, మారెళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో పండుగ వాతావరణం



మోపిదేవి దేవస్థానంలో స్వామివారికి పట్టు పవిత్రాలు సమర్పిస్తున్న వేదపండితులు

మోపిదేవి: పండుగ వాతావరణంలో సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో రెండో రోజు శుక్రవారం ఆషాఢ కృత్తిక పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు, రుత్వికులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు గోపూజ, సుప్రభాతసేవ, నిత్యార్చన, నవకుంభారోపణం, ఏకాదశ ద్రవ్యాభిషేకం, అన్నాభిషేకం, సుబ్రహ్మణ్య మూల మంత్ర అనుష్టానాలు, హవనం, మూల మూర్తులకు ఉత్సవ మూర్తులకు పట్టు పవిత్రాలు సమర్పణ, మహానివేదన, నీరాజన మంత్రపుష్పాలతో సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రదోష కాలార్చన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి తీర్థప్రసాద వినియోగం భక్తిశ్రద్ధలతో జరిపించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జోన్-3 పరిధిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఓరియెంటల్ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులను 2025-26 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల విద్య ఆర్జేడీ పి. కళావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలో 39, ఓరియెంటల్‌లో 10 చొప్పున పోస్టులను రెన్యువల్ చేసేందుకు గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ వరకు పని చేసిన 60 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పేరేచర్లలోని క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్లను నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లకు పంపిస్తామన్నారు. సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 73375 85790లో కోచ్ బ్రహ్మంను సంప్రదించాలని సూచించారు.

పిల్లల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల హోం సైన్స్ విభాగంలో నానీ కేర్ అండ్ న్యూట్రిషన్ (పిల్లల సంరక్షణ)పై ఏడాది వ్యవధి గల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూట్రిషన్, చైల్డ్‌కేర్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. చేరేందుకు ఆసక్తి కలిగిన పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్న వారు అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 90592 00037, 95420 32539 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'అక్షర ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె.అంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

నరసరావుపేట: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే 'అక్షర ఆంధ్ర'ను సమర్థంగా నిర్వహించి విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు కె.అంజనేయులు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పించాలని సూచించారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్సియల్ లిటరసీలను విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. జిల్లాలోని 1,27,565 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సహకారంతో ఆగస్టు ఏడో తేదీన అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించాలని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి నిరక్షరాస్యులకు విద్య నేర్పించి, ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదే మార్చిలో నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన మదింపు పరీక్ష నిర్వహణకు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించాలని వివిధ శాఖల అధికారులను కోరారు. వయోజన విద్యాశాఖ తరఫున నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరికీ రెండు వాచకాలు, వర్క్ షీట్స్, దృశ్య శ్రవణ వీడియోలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వలంటీర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరికీ పది మంది నిరక్షరాస్యులను అప్పగించాలని చెప్పారు. ఈనెల 26వ తేదీలోగా సమగ్రంగా నివేదికలు అందజేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఝాన్సీరాణి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ డీపీఎం వీరాస్వామి, ఐసీడీఎస్ పీడీ అరుణ, డీఈవో చంద్రకళ, జీఎస్‌డబ్ల్యూఎస్ వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

రేపు పల్నాడు జిల్లా స్థాయి చెస్ పోటీలు

మాచర్ల: అంతర్జాతీయ చదరంగం పోటీలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని కోదండ రామాలయంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ, పల్నాడు చెస్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కోచ్ కిరణ్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులకు పోటీల వివరాలు తెలిపారు. రూ.100 ఎంట్రీ ఫీజు కట్టి పాల్గొనాలన్నారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారికి నగదు, ట్రోఫీలు ఇస్తామని పేర్కొన్నారు. 7,9,11,13,15 వయసు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి, ముగ్గురు బాలికలకు పతకాలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. వివరాలకు 9390059759 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.